# గురు చరిత్ర-గేయం

## ప్రార్థన

ఈశ్వరసుతుని విఘ్న వారకుని శ్రీగణనాథుని పాదపద్మముల
వీణాపాణి విభునికి రాణి శారద మాతా పాదపద్మముల
విద్యను గరపి విజ్ఞునిచేసిన శ్రీగురు దేవుల పాద పద్మముల
మనసున నిలిపి ప్రార్థనజేసి శ్రీగురుకథను ప్రారంభించెద

సాయిలీలలను శ్రీగురుచరితను చక్కని కథలుగ వ్రాసి ముద్రించిన
ఎక్కిరాల వంశోద్భవుడాచార్య భరద్వాజ గురునే ప్రార్థించెద
సకల దేవతలు సాధువులందరు జీవులన్నియు జడములుగూడ
సాయి రూపులని సతతము కొలిచెడు భక్తులందరకు నమస్కరించెద

## శ్రీగురు కథాగానము

శ్రీ గురుచరితము నవరసభరితము శ్రీగురుగానము చేయుము నిరతము
విఘ్నములన్నియు తొలగిపోవును విజయములెన్నియొ వరించిచేరును
॥శ్రీగురు॥

గోదావరి తీరం పిఠాపురము పావనమైన గ్రామం
భాద్రపద శుద్ధ చతుర్థినాడు శ్రీపాద వల్లభ జననం
సుమతి ఇచ్చిన భిక్ష ఫలితము దత్తాత్రేయుని వరము
సుమతి అప్పళరాజు శర్మలకు దత్తాత్రేయుని జననం. ॥శ్రీగురు॥

ఏడు వత్సరముల ప్రాయమునందు శ్రీపాదునకుపనయనం
యజ్ఞోపవీతధారణతోనే చేసెను వేదగానం
పదహారేండ్ల ప్రాయమునందున సన్యాసాశ్రమ స్వీకారం



సోదరులిర్వుర స్వస్థులచేసి దేశాటనకై పయనం
కాశీబృందావనబదరికాశ్రమం గోకర్ణ శ్రీశైలం
నివృత్తి సంగమం దర్శించి కురుపురమందున స్థిరనివాసం ॥శ్రీగురు॥

అంబాదేవి కొడుకును బ్రోచి ఆత్మహత్యను వారించి
తానే కొడుకై పుట్టగలనని అంబాదేవికి వరమిచ్చి
రజకునకొకనికి రాజభోగము కలుగునట్లుగా దీవించి
మరుసటి జన్మలో యవనవంశమున జన్మించెదవని వరమిచ్చి
ఆశ్వయుజ బహుళ ద్వాదశిదినమున కృష్ణానదిలోఅంతర్హితము ॥శ్రీ గురు॥

వల్లభేశుడను బ్రాహ్మణడొకనికి వ్యాపారములో లాభం
బ్రాహ్మణ సంతర్పణ చేయుటకై కురుపురమునకు ప్రయాణం
మార్గమధ్యమున దొంగలచేతిలో వల్లభేశునీ మరణం
యతిరూపంబున శ్రీపాద వల్లభుడు చేసెను దొంగల సంహారం
తిరిగి బ్రతికిన వల్లభేశుడు చేసెను బ్రాహ్మణ సంతర్పణము ॥శ్రీ గురు॥

కాషాయాంబర కౌపీనముతో శ్రీపాదుల రూపం
రుద్రాక్షమాలా భస్మంబులతో భక్తుల బ్రోచెడి రూపం
తలపై జడలతోపద్మనేత్రుడై వెలుగొందెడి రూపం
ఉన్నతమై హిమనగమునుబోలు శ్రీపాదుని దేహం
కృష్ణాస్నానము గాయత్రి జపము స్వామికి నిత్య వ్రతము
పాదుక పూజతో అన్నదానముతో తరియించును జనము. ॥శ్రీ గురు॥

కరంజా అనుగ్రామమునందు బ్రాహ్మణులింట అంబ జనించెను
భక్తితో శివుని పూజించెడుఅంబకు మాధవశర్మతో వివాహమాయెను
ఆలస్యముగా పుట్టిన బిడ్డడు వెంటనే ప్రణవోచ్చారణ చేసెను
శాలగ్రామదేవయను బాలుని నరహరి అని అందరు పిలచిరి ॥శ్రీ గురు॥

బాలుడు త్రాకిన తల్లి రొమ్మున పాలువెల్లువై పొంగి పారలెను
ఏడు వత్సరముల ప్రాయమువరకును ప్రణవనాదమునె ఉచ్ఛరించెను

సర్వసిద్ధులు తనకు దాసులని ఇనుమును స్వర్ణముగా మార్చి చూపెను
మాటలు లేవని బాధపడెడు తల్లిదండ్రులను ఊరడించెను.
ఉపనయమును చేసిచూడుడని సంజ్ఞలతోనే తెలియచేసెను
భిక్షానంతరము వేదముపఠించి భిక్షావృత్తికి అనుమతికోరెను
తల్లి దుఃఖమును తొలగించుటకై ఒక్కవత్సరము ఆగదలంచెను
తల్లికి కవలలు జన్మించిన తదుపరి సన్యసించుటకు నిర్ణయించెను ॥శ్రీ గురు॥

శిరస్త్రాణము, చేతదండము కౌపీనము కాషాయాంబరములతో
కాశిలో బ్రహ్మజ్ఞాని శ్రీకృష్ణసరస్వతిపాదుల శిష్యుడాయెను
నృసింహ సరస్వతిగ పేరు మార్చబడి దేశాటనకై బయలుదేరెను
మాతృదర్శనం చేసిన తదుపరి త్రయంబక నాసిక్ మంజరీకములు
సందర్శించి పావనమొందించి లీలలుచూపుచు ముందుకు సాగెను.॥శ్రీగురు॥

మాధవార్యుడను నృసింహభక్తునకు ధ్యానము నందున దర్శనమిచ్చెను
బాసరలోన బ్రాహ్మణుడొకనికి శూల బాధను నివారించెను
బ్రాహ్మణద్వేషి యవనుని కొలువున సాయందేవుడు హింసలు పొందెను
శ్రీ గురుడాతని బ్రోచిరక్షించి శిష్యునిగాతనిని స్వీకరించెను. ॥శ్రీగురు॥

వైద్యనాథమున బుద్ధిహీనుడు గురువునుత్యజించి శ్రీగురు చేరెను
శ్రీ గురుడాతని మందలించుచు తానే ఆ గురువును చూపెను ॥శ్రీగురు॥

భువనేశ్వరిక్షేత్రము భిల్లవటి అనునది శ్రీగురుస్పర్శతో పునీతమయినది
అతి పవిత్రము ఉదంబర వృక్షము దానిమూలమున శ్రీగురుడుండెను
మందమతి అయిన బ్రాహ్మణుడొకడు భువనేశ్వరినిభక్తితో కొలిచెను
నాలుక కోసి దేవికర్పింప శ్రీగురునొద్దకు దేవి పంపెను
శ్రీ గురుచేరి ప్రార్ధింపగానే నాలుక మొలిచి పండితుడాయెను ॥శ్రీగురు॥

అమరపురమున పేద బ్రాహ్మణుని భిక్షనిమ్మని శ్రీ గురుడడిగెను
తనకు లభించిన చిక్కుడు కూరతో శ్రీగురున కిల్లాలు భిక్షనొసంగెను
తిరిగి పోవుచు శ్రీగురుడెందుకో చిక్కుడు మొక్కను పీకివైచెను ~~పైచెను~~ వేసెను



దానిని నాటిన దంపతులిర్వురు నిధినిపొంది సంతోషమందిరి. ॥శ్రీ గురు॥

గంగానుజుడను బెస్తవానికి శ్రీగురు సేవలు లభ్యమాయెను
యోగినులందరు కలసి పూజించుట గంగానుజుడు చూచితరించెను.
శ్రీగురుడాతని ఆశీర్వదించి యోగగతిన త్రిస్థలిని చూపెను.
కరవీరము యుగాలయములతో పంచ గంగా సంగమము
ప్రయాగ, కాశీ, గయలతో బాటు ప్రసిద్ధమైన రెండవ త్రిస్థలి. ॥శ్రీ గురు॥

శిరోలయందు బ్రాహ్మణుడొకనికి పుట్టినసంతతి పురిటిలో కూలెను
సంగమమందున స్నానము చేసి శ్రీపాదుకలను భక్తితో కొలిచెను
శ్రీ గురుడతనికి స్వప్న మందున టెంకాయలను ప్రీతితో ఇచ్చెను
వాటిని తినిన బ్రాహ్మణీ కప్పుడు ఇద్దరు బాలురు ఉద్భవించిరి
పెద్దవాడు మరణించుట కనుగొని దంపతులిర్వురు కడుశోకించిరి
పాదుకల వద్ద వుంచిన శవము ఊపిరి పొంది తిరిగి జీవించెను.॥శ్రీ గురు॥

అహంకారులు పండితులిర్వురు వేదవాదనకు త్రివిక్రముపిలిచిరి
త్రివిక్రముడు శ్రీగురుప్రార్థింప పండితులిర్వుర మందలించెను.
మాదిగవానికి విభూతి పూసి వేదము పాడగ ఆజ్ఞాపించెను
పండితులిర్వురు భయకంపితులై శ్రీగురుదేవుని శరణుజొచ్చిరి ॥శ్రీగురు॥

మాహుర పురమున గోపీనాధుడు సంపన్నుడైన బ్రాహ్మణుడు
దత్తాత్రేయుని వరప్రసాదముగ దత్తుండను పుత్రుడు కలిగెను
పదహారు వత్సరముల ప్రాయమునందున సావిత్రితోడ వివాహమాయెను
అన్యోన్యముతో యెడబాటు లేక ప్రేమతో వారు జీవించసాగిరి
దురదృష్టమున క్షయవ్యాధి సోకి దత్తుడు క్రమముగ క్షీణింపసాగెను. ॥శ్రీ గురు॥

మానవ యత్నము విఫలము కాగా శ్రీగురు చేరగ నిర్ణయించెను.
మార్గమధ్యమున మరణించిన దత్తుని కన్గొని సావిత్రికడుదుఃఖించెను.
తారసిల్లిన తాపస్తోతముడు రుద్రాక్షలను ఊది నొసంగెను
సహగమనమును చేయదలంచి సావిత్రి త్రో శ్రీగురు చేరెను
శ్రీగురుడామెను ఆశీర్వదించి దత్తుని తిరిగి జీవుని చేసెను. ॥శ్రీగురు॥

భాస్కరశర్మ అనెడి భక్తుడు ముప్పురికి భిక్షను ఈయదలచెను
శ్రీగురునాశీర్వాదఫలితముగ వేల సంఖ్యలో భిక్ష నొసంగెను
గాణ్గాపురమున ప్రాయములుడిగిన గొడ్రాలొకర్తె సంతతి కోరెను
శ్రీ గురుడామెను ఆశీర్వదించి బిడ్డల నొసగి ప్రీతిగ పంపెను ॥శ్రీ గురు॥

నరహరి కుష్టును తొలగించుటకై ఎండినమేడి కొమ్మను నాటెను
దానిని పెంచి చిగురింప చేసిన వ్యాధితొలుగునని వక్కాణించెను
నమ్మకముంచిన నరహరి భక్తికి మెచ్చిన మేడిచిగిర్చి పెరిగెను
వ్యాధి తొలగగా నరహరి ముదముతో శ్రీగురు కీర్తిని స్తోత్రము చేసెను
శ్రీగురుడతనికి యోగేశ్వరుడని బిరుదునిచ్చిసత్కారము చేసెను ॥శ్రీ గురు॥

సాయందేవుని నిప్పును తెమ్మని కుంభవృష్టిలో మఠమున కంపెను
అయిదు తలల సర్పాల రెండిటినిసృష్టించి పంపెను భక్త రక్షణకై
తనను స్తుతించిన సాయందేవుని వంశమునందున భక్తి స్థిరమనె ॥శ్రీ గురు॥

బంధువులందరు శ్రీశైలమరుగగ తంతుకుడుండెను శ్రీ గురుచెంత
తంతుకునను శ్రీశైల మహాత్మ్యము చెప్పి గొంపోయెను యోగ మార్గమున
ఆలయమందున శివుని స్థానమున శ్రీగురుదర్శనమాయె భక్తునకు
ఆనందంబున తిరిగి వచ్చిన తంతుకు నెంతయొ మెచ్చిరి ప్రజలు॥ శ్రీ గురు॥

నందిశర్మ తన కుష్టు బాపమని తులజ భవానిని ప్రార్థన చేసెను
అతని భక్తికి మెచ్చిన దేవి చండలేశ్వరిని శరణు వేడమనె
పూజలందుకొని ఆ పరమేశ్వరి శ్రీగురుసేవను చేసికొమ్మనెను
శ్రీగురుడాతని షట్కూలమందున స్నానమాడించి, వస్త్రములిచ్చి
కుష్టును బాపిఆశీర్వదించి, స్తోత్రము విని తానానందించెను॥శ్రీ గురు॥

హిప్పరిగిలోన నరహరి కలడు కల్లేశ్వరునకు కడు ప్రియ భక్తుడు
కలలో గాంచిన శ్రీ గురుదేవుని తాను స్వయముగ సేవించితరించెను ॥శ్రీగురు॥



దీపావళి ఉత్సవమున బిక్ష స్వీకరించమని భక్తులెల్లరు శ్రీగురు వేడగ
విశ్వరూపుడై ఏకకాలమున ఎనిమిది గృహముల బిక్షను గ్రహించె
పర్వతేశుడను శూద్రుండొకడు భక్తితో శ్రీగురు ప్రార్థన చేసెను
జొన్నపైరును కోసి వేయుమని శ్రీగురుడాతని ఆజ్ఞాపించెను
బంధువులెవ్వరి లెక్కచేయకనె పర్వతేశుడు పైరును కోసెను
అకాలమందున వర్షము కురవగ కోసిన మొక్కలు పిలకల నిచ్చెను
పిలకలు పెరిగి పంటలు పండి ధాన్యము కుప్పలు తెప్పలాయెను. ॥శ్రీగురు॥

బీదరునేలెడి యవనరాజుకు స్ఫోటకమొచ్చి కృంగదీసెను
శ్రీగురుచేరి ప్రార్థనచేయగ రజకుడనీవని గుర్తుచేసెను
వ్యాధి తొలగగా శ్రీగురుదేవుని తన రాజ్యమునకు ఆహ్వానించెను.
గోవధనాపి శ్రీగురు పూజించి యవనరాజు తా ధన్యుడయ్యెను ॥శ్రీగురు॥

ఈశ్వరలోన మఠమునందున శ్రీగురుదేవుడు పాదుకలుంచెను
అశ్వత్థ వృక్షము మూలమునందున విఘ్నేశ్వరుని ప్రతిష్ఠించెను
బహు ధాన్యములో మాఘమాసమున కృష్ణపాడ్యమి శుభ ఘడియలో
శ్రీశైల మందలి పాతాళగంగలో శ్రీగురుదేవుడు పయనించిసాగెను ॥శ్రీగురు॥

## మంగళం

బ్రహ్మవిష్ణు ఈశ్వర రూపుడు అనసూయా అత్రి తనయుడు
దత్తాత్రేయుడు శ్రీపాదవల్లభ శ్రీగురుదేవులకిదె మంగళం
అతి పవిత్రము ఔదుంబరము అశ్వత్థమునకు శ్రీపాదుకలకు
సాయినాథునకు సకలదేవులకు భరద్వాజ గురుసార్వభౌమునకు
జయ మంగళం నిత్య శుభ మంగళం
జయ మంగళం నిత్య శుభ మంగళం
సాయినాథా నీకు సన్మంగళం

(మురోనంద దీపం సౌజన్యంతో)